

## నువ్వా.. నేనా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారు. యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేస్తూ అక్రమార్జనలో పోటీ పడుతున్నారు.


8లో



## కటకటాల్లోకి కీచక గురువు

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు దారి తప్పాడు. తన వద్ద చదువుకుంటున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. చివరకు కటకటాల పాలయ్యాడు.

## మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 9,078 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.25 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 6,800 క్యూసెక్కుల నీరు వదిలారు.

## న్యూస్‌రీల్

### 'తాడిపర్రు' బాధితులకు నష్ట పరిహారం



బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

ఉండ్రాజవరం: మండలంలో తాడిపర్రు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.ఐదు లక్షల చొప్పున పరిహార చెక్కులను ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితి బాధకరమని, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంత, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఆమె చెక్కులను అందజేశారు. ఆమె వెంట తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్ బయాలజీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించిన డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా బయాలజీ ఫోరమ్ పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం తమ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎంఈవో కుశలవదొర, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు రమణరావు, గణపతి, జిల్లా బయాలజీ ఫోరమ్ అధ్యక్షుడు శ్రీనివాస నెహ్రూ, ప్రధాన కార్యదర్శి సుధారాణి, ఉపాధ్యాయులు వీరబాబు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ విధానం కోసం పోరాటం

సామర్లకోట: రైల్వే ఉద్యోగులు, కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పోరాటం చేస్తోందని సంఘ విజయవాడ డివిజన్ ప్రధాన కార్యదర్శి, ఏఐఆర్‌ఎఫ్ కోశాధికారి సీహెచ్ శంకరరావు అన్నారు. రైల్వే సంఘ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక సంఘ కార్యాలయం వద్ద జరిగిన సభలో మాట్లాడారు. భారతీయ రైల్వేలో యూనియన్ల గుర్తింపు కోసం డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని రైల్వే బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. ఈ మేరకు డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరిగే ఎన్నికల్లో తమ సంఘానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ డివిజనల్ కార్యదర్శి ఎం.లీల, అధ్యక్షుడు రామ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# దీవెనపై దాష్టీకం



- ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల చర్యలతో విద్యార్థులలో ఆందోళన
- త్వరలో తొలి సెమిస్టర్ పరీక్షలు
- విద్యార్థులకు యాజమాన్యాల వేధింపు
- రూ.35 వేల ఫీజు చెల్లించాలని ఒత్తిడి
- తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు
- రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులను ఆదుకున్న 'విద్యా దీవెన'

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై జులుం ప్రదర్శిస్తున్నాయి. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు తొలి సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫీజు కడతారా..? లేదా..? అని వారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారు. ట్యూషన్ ఫీజులో సగం చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నాయి. ఒక్కసారిగా రూ.35 వేల నుంచి రూ. 60 వేలు చెల్లించాలంటే ఎలాగని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పరీక్షలకు అనుమతించాలంటే ఫీజు కట్టాల్సిందేనని తెగేసి చెబుతున్నాయి. ఈ పరిణామంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'విద్యా, వసతి దీవెన' పథకాల్లో విద్యార్థులకు అవసరమైన సమయాల్లో ఆర్థిక ఆసరా అందేది. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ పథకాలకు మంగళం పాడింది. ఫీజు రియంబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువస్తామని ప్రకటనలు చేసింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా.. నేటికీ అతీగతి లేదు. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఎదురైందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజుల దోపిడీపై పలు విద్యార్థి సంఘాలు ఉద్యమబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నాయి.



**మితిమీరిన ఒత్తిళ్లు**

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యాలు నిర్ణయించాయి. పరీక్ష ఫీజు రూ.1,250 చెల్లించాలని నోటీసులు జారీ చేశాయి. చిన్న మొత్తమే కదా అని ఫీజు చెల్లించేందుకు వెళుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో సగం కడితేనే పరీక్ష ఫీజు చెల్లించేందుకు వీలుగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని చావు కబురు చల్లగా చెబుతున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులను బట్టి ట్యూషన్ ఫీజు రూ.43 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంటుంది. సెమిస్టర్ పరీక్షలు రాయాలంటే రూ.32 వేల నుంచి రూ.63 వేల వరకు చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నారు. లేదంటే పరీక్షలకు అనుమతించబోమని కనికరం లేకుండా మాట్లాడుతున్నట్టు తెలిసింది. ఈ పరిణామం నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆవేదన నింపుతోంది. ఆ విద్యార్థులు కష్టపడి ఏపీ ఈసెట్లో ఉత్తమ ర్యాంక్ సాధించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందనే భరోసాతో మంచి కళాశాలల్లో అడ్మిషన్లు పొందారు. తీరా ఫీజుల ఒత్తిడి ప్రారంభమవడంతో ఏం చేయాలో దిక్కుతోచక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ సెకెండ్, థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. చేసేది లేక.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న తల్లిదండ్రులు ఎలాగోలా అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తుంటే.. మరి కొందరు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.



**విద్యాదీవెనకు మంగళం**

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాదీవెన పథకాన్ని తీసుకువచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపులు, క్రైస్తవ వర్గాలకు చెందిన వేలాది మంది పేద విద్యార్థులు ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు 10 ఇంజినీరింగ్ కళాశాలలు, 7 డిగ్రీ కళాశాలలు 7 ఉండగా.. 25 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చదువుతున్నారు. వీరంతా గతంలో విద్యా దీవెన పథకంలో ఆర్థిక సాయం పొందేవారు. కళాశాలలను గ్రేడ్లుగా విభజించి ఏ-గ్రేడ్ కళాశాలలో చదివే వారికి ఏడాదికి రూ.18,400, బీ-గ్రేడ్ కళాశాలల్లో చదివేవారికి రూ.15,300 చొప్పున గత ప్రభుత్వం చెల్లించేది. నాలుగు దశల్లో ఫీజు రీయింబర్స్ చేసి సొమ్ములను విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాలలో జమ చేసింది. ఆ సొమ్ముతో విద్యార్థులు ఫీజులు కట్టేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో జిల్లాలోని 70,241 మంది విద్యార్థులకు రూ.142.99 కోట్లు చెల్లించింది.

**రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టతేదీ?**

గత ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఆ పథకం స్థానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని ప్రకటించింది. అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా నేటికీ పథకం విధి విధానాలపై స్పష్టత ఇవ్వలేదు. సాధ్యాసాధ్యాలపై స్పష్టత ఇచ్చే వరకు విద్యార్థులను ఫీజుల విషయంలో ఇబ్బందులు పెట్టవద్దని కళాశాల యాజమాన్యాలకు సైతం ప్రభుత్వం ఆదేశాలిచ్చిన దాఖలాలు లేవు. పథకం ఎప్పటి నుంచి అమలవుతుందన్న విషయంలో కూడా ఎలాంటి స్పష్టతా లేదు. అసలు అమలు చేస్తారా..? చేతులేత్తేస్తారా..? అన్న ప్రశ్న తల్లిదండ్రుల్లో ఉత్పన్నమవుతోంది. దీంతో రంగంలోకి దిగిన ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తమ ఫీజులు రాబట్టుకునేందుకు విద్యార్థులపై ఒత్తిడి పెంచేశారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులపై ఇవి మరింత తీవ్రమయ్యాయి. కాలయాపన చేసి పథకాన్ని నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### మితిమీరుతున్న ప్రైవేటు కళాశాలల ఆగడాలు



ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాల ఆగడాలు మితిమీరుతున్నాయి. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పెద్ద ఎత్తున దోపిడీకి ఎగబడుతున్నాయి. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫీజు వేధింపులు పెరిగిపోయాయి. ఫీజులు చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వబోమని చెప్పడం దారుణం. దీనిపై ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఎప్పుడు అమలు చేస్తుందో ప్రకటించాలి.

– తాడేపల్లి విజయ్‌కుమార్, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

### యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఎవరి అకౌంట్‌లో జమ చేస్తారో చెప్పాలి. ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతం వసూలు చేస్తున్నారు. ఫీజు కట్టకపోతే హాల్ టికెట్లు ఆపుతామని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా భయపెట్టి విద్యార్థుల దగ్గర నుంచి ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాంటి యజమాన్యాలపై తక్షణం చర్యలు తీసుకోవాలి.

– వై.భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

# భక్తులకు తీరనున్న హాట్ పాట్లు



సత్యదేవుని తెప్పోత్సవానికి ఉపయోగించే పంటు ను నదిలోకి దింపిన దృశ్యం



పంటును నదిలోకి దింపుతున్న సిబ్బంది

- పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్ నిర్మాణానికి అనుమతి
- రూ.88 లక్షలతో 'టెన్‌సిల్' షెడ్డు

అన్నవరం: రత్నగిరి భక్తులకు పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ప్రతిపాదనల మేరకు రూ.88 లక్షలతో వంద అడుగుల పొడవు, 80 అడుగుల వెడల్పున అధునాతన టెక్నాలజీతో 'టెన్‌సిల్' షెడ్డు నిర్మాణానికి దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే దీని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న 60 గదుల వీఐపీ సత్రాన్ని గత ఏడాది కూల్చివేసి విశ్రాంతి షెడ్డు నిర్మించాలనుకున్నప్పటికీ కారణాంతరాలతో సాధ్యం కాలేదు.

**'సాక్షి' కథనంతో ప్రతిపాదనలు**

ఈ ఏడాది జనవరి 20వ తేదీన సాక్షి దినపత్రికలో 'రత్నగిరిపై హాట్ పాట్లు' శీర్షికన ప్రచురితమైన కథనంతో ఈఓ రామచంద్రమోహన్ స్పందించి అధునాతన సాంకేతికతతో 'టెన్‌సిల్' షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే మార్చి నెలలో ఎన్నికల కోడ్, అనంతరం ప్రభుత్వం మార్పు తదితర కారణాలతో ఆ నిర్మాణానికి అనుమతులు రావడం ఆలస్యమైంది. తాజాగా ఈ టెన్‌సిల్ నిర్మాణానికి దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి మంజూరు చేశారని ఈఓ తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పశ్చిమ రాజగోపురానికి అడ్డుగా కాకుండా ఒక పక్కగా నిర్మిస్తామని ఆయన వివరించారు.

**13న సత్యదేవుని తెప్పోత్సవం**

క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవంలో ఉపయోగించే పంటుకు మంగళవారం పూజలు చేసి నదిలోకి దింపారు. ప్రస్తుతం పంపా నదిలో నీటి మట్టం 99 అడుగులకు ఉందని, ఉత్సవం నిర్వహణకు 94 అడుగుల నీటిమట్టం సరిపోతుందని అధికారులు తెలిపారు. దేవస్థానం ఏసీ రామ్మోహన్‌రావు, ఈఈ రామకృష్ణ, డీఈలు రాంబాబు, గుర్రాజు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ ఈ పనులను పర్యవేక్షించారు. ఇరిగేషన్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మమ్ము కాచుకో నాగన్నా..



జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. నాగదేవతను కొందరు సుబ్రహ్మణ్యేశ్వరునిగా పూజించి పుట్టల వద్ద పాలతో అభిషేకాలు చేశారు. భక్తులు సమీపాల్లోని పుట్టల వద్దకు వెళ్లి చిమ్మిడి, వరి నూక, పాలు, పండ్లు, కోడిగుడ్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు, పెద్దలు పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు.

# వరి సిరులై కురిసె..

- ముమ్మరంగా ఖరీఫ్ కోతలు
- ఆశాజనకంగా దిగుబడులు
- ఎకరాకు 38 నుంచి 40 బస్తాలు
- జిల్లాలో 4.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా



యంత్రాలతో వరి కోతలు

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండిచే అన్నదాతలకు ఆయా పంటల నుంచి ఆశించిన దిగుబడులు వస్తుంటే ఆనందానికి అవధులు ఉండవు. జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాలలో ఇదే పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పిలువకుండానే పలుకరిస్తున్న వరుణుడితో ఎన్నో లాభనష్టాలను ఎదుర్కొంటూ సహనంతో సాగు చేసిన రైతన్నలు ప్రస్తుతం మంచి దిగుబడులు అందుకుంటున్నారు. ఈ సమయంలో కూడా తుపాన్లు, అల్పపీడనాలు అలజడి రేపుతున్నా ఏ మాత్రం చెక్కుచెదరకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ పంటను జాగ్రత్త చేసుకునే ప్రయత్నంలో తలమునకలవుతున్నారు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 71,600 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. వీటి నుంచి 4.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా కాగా, ఇప్పటి వరకు జిల్లాలో 6 వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. ఎకరానికి 38 నుంచి 40 బస్తాలు దిగుబడి (75 కిలోలు) వస్తుంది. ఈ క్రమంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు వారాల్లో కోతలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం గోదావరికి అవతల ఉన్న నల్లజర్ల, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, ఇవతల ఉన్న సీతానగరం, రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలలో వరి కోతలు యంత్రాల సాయంతో ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటితో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాకినాడ జిల్లాలోని మురారి, గండేపల్లి, జగ్గంపేట ప్రాంతాలలోను వరి పంట కోతలు చేపట్టారు.

**ఒడిదుడుకుల నడుమ సాగు**

ఈ ఖరీఫ్ సీజన్‌లో తుపానులు, అల్పపీడనాల ప్రభావంతో అవసరానికి మించి వర్షాలు కురియడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల సాయంతో జూన్ నెలాఖరు నాటికే చాలా మంది రైతులు వరి నాట్లు వేయడం పూర్తి చేశారు. ఆ తరువాత కొద్ది ఆలస్యంగా నాట్లు పడిన చోట జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలు, ముంపులు రైతులను ఇబ్బంది పెట్టాయి. ముఖ్యంగా సెమీ డెల్టా సిస్టమ్ ఏరియాగా భావించే కొన్ని ప్రాంతాలు ముంపునకు గురై, వరి నాట్లు దెబ్బతిన్నాయి. ఎర్రకాలువ, కొవ్వాడ కాలువలతో పాటు గోదావరి వరద నీరు ఎగదన్నడంతో సీతానగరం, కోరుకొండ మండలాలలోని వందలాది ఎకరాలలో వరి నాట్లు మునిగిపోయాయి. అలాగే కంసారివారి పాలెం, నిడదవోలు పరిసర ప్రాంతాలలో వేసిన వరి నాట్లు కూడా దెబ్బతిన్నాయి. దీనితో ఆయా ప్రాంతాలలోని రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మరోసారి వరి నాట్లు వేయవలసివచ్చింది. ఈ నేపథ్యంలో 150 రోజులలో దిగుబడులు వచ్చే వరి వంగడాలను కాకుండా 120 రోజుల్లోనే కోతకు వచ్చే స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో వరి పంట గింజ కట్టే దశలో ఉంది. ఇక్కడ కూడా రైతులు ఆశించినట్టు ఎకరాకు 40 బస్తాల పైబడి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### దిగుబడులు బాగున్నాయి



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి దిగుబడులు చాలా వరకు రైతులు ఆశించిన మేరకు వస్తున్నాయి. జిల్లాలో 4.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లక్ష్యాన్ని సులువుగానే చేరుకోగలం. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు ఆరు వేల హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలు కంగారు పెడుతున్నప్పటికీ పంట కోతలు చేపడితే సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి, ధాన్యాన్ని కళ్లాల్లో లేకుండా జాగ్రత్త పడాలి. అవకాశం ఉన్నంత మేరకు మార్కెట్‌కి తరలించడం లేదా, కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్లకు పంపించాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



# ఒక్క సంతకంతోనే తతంగం

కాకినాడ క్రైం: నర్సింగ్ పోస్టుల భర్తీలో అవకతవకలపై అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వెలుగులోకి వస్తోంది. కాకినాడ జీజీహెచ్ మేనేజర్ వైవీఎస్ఎన్ నరసింగరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆరా తీయడం చర్చనీయాంశమైంది. సూపరింటెండెంట్‌తో మాట్లాడి పూర్తి పారదర్శకంగా విచారణ జరగాలని ఆదేశాలిచ్చారు. గత కలెక్టర్‌నే తప్పుదోవ పట్టించిన నరసింగరావు వ్యవహారశైలిపై ప్రస్తుత కలెక్టర్ షణ్మోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఆయన కార్యాలయంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారితో గంటకు పైగా సమావేశం అయ్యారు. 2020 డిసెంబర్‌లో జరిగిన నర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించి కలెక్టర్‌కు సమర్పించిన నోట్‌ఫైల్‌పై ఏడీ, సీనియర్ అసిస్టెంట్ల సంతకాలు లేకుండా కేవలం మేనేజర్ సంతకం మాత్రమే ఉండడం కలెక్టర్‌నే నిర్ఘాంతపోయేలా చేసింది. కోవిడ్ వేళ అప్పటి కలెక్టర్ సహా ఇతర అధికారులకు తీరిక లేని సమయాన్ని నరసింగరావు తనకు అనుకూలంగా మలుచుకున్నాడని విచారణలో నిర్ధారణ అయింది. దీని ద్వారానే తాను లంచాలు తీసుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చేలా చేసి, నిజమైన అర్హులకు అన్యాయం చేశాడని ప్రాథమికంగా తేల్చారు.

విచారణ కమిటీ సంధించిన 20 ప్రశ్నలకు ఒక్క రోజులో బదులు ఇవ్వాల్సిన ఉండగా, రెండు వారాల సుదీర్ఘ విరామం తర్వాత నరసింగరావు మంగళవారం తన సమాధానాలు అందించాడు. జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుపై అందిన ఫిర్యాదు, చేపడుతున్న విచారణను ఈ సందర్భంగా విచారణ కమిటీ నిర్ధారించింది. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. విచారణ కొనసాగుతోందనీ, తమ నివేదిక ఆధారంగా సూపరింటెండెంట్ తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిస్తామని కమిటీ ప్రకటనలో పేర్కొంది.

## క్లుప్తంగా

### బొలెరో వాహనం దగ్ధం


వ్యాన్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

**ఆలమూరు:** ఆలమూరు – మండపేట రోడ్డులో మంగళవారం బొలెరో వాహనం దగ్ధమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఓఎన్‌జీసీ మండపేట కేజీ బేసిన్‌కు చెందిన బొలెరో వ్యాన్ స్థానిక దేవీ థియేటర్ వద్దకు వచ్చేసరికి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. దానిలోని డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులు వెంటనే కిందకు దిగిపోయారు. అంతలోనే వ్యాన్ క్షణాల్లో పూర్తిగా కాలిపోయింది. దట్టమైన పొగతో కూడిన మంటలు రావడంతో వాహనచోదకులు భయాందోళన చెందారు. ఘటనా స్థలానికి ఇరువైపులా సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మండపేట అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేటి నుంచి స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** జిల్లా స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 9 వరకూ అంతర్ జిల్లాల స్కేటింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి దొరస్వామి మంగళవారం తెలిపారు. స్థానిక వైఎస్‌ఆర్ మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో బుధ, గురువారాల్లో రింక్ విభాగంలో, 8, 9 తేదీలలో రోడ్ విభాగంలో నిర్వహిస్తామన్నారు. వీటికి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు.

### 7, 8 తేదీలలో జిమ్నాస్టిక్స్ పోటీలు

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీలలో ఎస్‌జీఎఫ్ఐ 66వ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలను కాకినాడలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి మంగళవారం విలేకరులకు తెలిపారు. కాకినాడ డీఎస్ఏ జిమ్నాజియంలో జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడాధికారులు, కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతారన్నారు. అండర్–14, 17, 19 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ప్రారంభిస్తారన్నారు.

# నువ్వా.. నేనా..

- ఇసుక దోపిడీకి కూటమి నాయకుల పోటాపోటీ
- యథేచ్ఛగా అక్రమ తరలింపు
- ఉచితం మాటున అక్రమార్జన
- పట్టించుకోని అధికారులు


రావులపాలెం మండలం గోపాలపురంలోని వశిష్ట గోదావరిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

**రావులపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారు. యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేస్తూ అక్రమార్జనలో పోటీ పడుతున్నారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల చేసిన ప్రకటనతో వీరు మరింత విజృంభించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో సామాన్యులకు ఎంత లాభం కలిగిందో తెలియదు గానీ కూటమి నాయకులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. నిబంధనలను తొంగలోకి తొక్కి కూటమి నాయకులు ఇసుక తవ్వకాలను నడిపిస్తున్నారు. రావులపాలెం మండలం గోపాలపురం పాత ఇసుక ర్యాంపు బాటలో మంగళవారం వందల ట్రాక్టర్లతో అక్రమ తవ్వకాలకు తెరలేపారు.

**ట్రాక్టర్ ఇసుక రూ.600**

ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రకటించడంతో పాటు సీనరేజీను రద్దు చేసింది. అయితే గోపాలపురంలో ట్రాక్టర్ ఇసుకకు రూ.600 వసూలు చేస్తున్నారు. ఇందులో రూ.350 కూలీలకు కేటాయించగా, రూ. 250 బాట నిర్వహణ పేరుతో కూటమి నాయకులు జేబులు నింపుకొంటున్నారు. అయితే బాట నిర్వహణకు రూ.50 కేటాయించినా మిగిలిన రూ. 200లో రూ.100 బీ టాక్స్, మరో రూ.100 గ్రామానికి చెందిన నాయకుడికి ఏ టాక్స్‌గా కేటాయించినట్లు తెలుస్తుంది. ఒక్క రోజులోనే సుమారు 600 ట్రాక్టర్లకు ఎగుమతి చేయగా కూలీలకు కేటాయించిన సొమ్ము కాకుండా నాయకుల జేబుల్లోకి సుమారుగా రూ.1,50,000 వరకు వచ్చినట్టు అంచనా వేస్తున్నారు.

**సీఆర్‌జెడ్ పరిధిలో తవ్వకాలు**

ఇటీవల కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలోకి మండలంలోని గోపాలపురం, కొమరాజులంక, ముమ్మిడివరప్పాడు, రావులపాలెం గ్రామాలు చేరాయి. వీటిలో అక్రమ మైనింగ్ తవ్వకాలు చేపట్టకూడదంటూ నిబంధనలు ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా సాండ్ కమిటీ ఆయా ఊర్లను మినహాయించి, మిగిలిన గ్రామాలైన పొడగట్లపల్లి, ఊబలంక గ్రామాల్లో ఇసుకర్యాంపుల నిర్వహణకు పరిశీలన చేసింది. గోదావరిలో నీటి ప్రవాహం ఉండడంతో మరో పది రోజులు సమయం పడుతుందని అధికారులు చెప్పారు. అయితే ఈ నేపథ్యంలో గోపాలపురంలో పాత ఇసుక ర్యాంపులో ఇసుక మేటలు తేలడంతో కూటమి నాయకులు వాటిని సొమ్ము చేసుకునేందుకు నిబంధనలు లెక్కచేయకుండా తవ్వకాలు చేపట్టారు. స్థానిక కూటమి నాయకుల ట్రాక్టర్లకు పదుల సంఖ్యలో ట్రిప్పులు ఇస్తున్నారని, గృహ అవసరాల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి తెచ్చుకున్న తమ ట్రాక్టర్లకు ఒక ట్రిప్పు మాత్రమే ఇచ్చారంటూ పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు చెబుతున్నారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం రాష్ట్ర నాయకుడి అనుచరులు ఈ దందాకు తెరలేపారు. ఒక్కరోజులోనే రూ.లక్షల్లో జేబులు నింపుకొన్నారు. లారీ ఇసుకను రూ.20 వేలకు పైగా విక్రయిస్తూ అక్రమార్జనకు బాటలు వేసుకున్నారు.

**దోపిడీకి తెర**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి రావడంతో ఇదే వంకతో కూటమి నాయకులు ఇసుక దోపిడీకి తెర తీశారు. అధికారులు కోడ్ హడావుడిలో ఉంటారని, తమకు అడ్డు చెప్పేవారే ఉండరని భావించి అక్రమ తవ్వకాలకు బాటలు వేశారు. గోపాలపురంలో నిబంధనలను సైతం తుంగలోకి తొక్కి ఇసుక తవ్వకాలు చేపట్టారు.


గోపాలపురం ఇసుక ర్యాంపులో కూటమి నాయకుడి వాటర్ ట్యాంకర్


లారీలపై ఎగుమతి చేయడం కోసం ట్రాక్టర్లపై తీసుకువచ్చిన ఇసుకను డంప్ చేస్తున్న దృశ్యం


అనధికార వసూళ్లు చేస్తున్న కూటమి నాయకుల అనుచరులు

# నిశి వేళ ఇసుక దోపిడీ


నిడదవోలు మండలం పెండ్యాలలో ఇసుక స్టాక్ పాయింట్


పెండ్యాల స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

**నిడదవోలు రూరల్:** గోదావరి తీరం నుంచి ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగిపోతోంది. భవన నిర్మాణాల్లో గోదావరి ఇసుకకు ప్రాధాన్యం ఉండడంతో లబ్ధిదారులు వేలాది రూపాయలు చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో కూటమి నేతల అండతో మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలుగా ఇసుక అక్రమ వ్యాపారం సాగుతోంది. నిశిరాత్రిలో నిడదవోలు మండలం పెండ్యాల, పందలపర్రు, జీడిగుంట గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను రవాణ చేస్తున్నారు. పెండ్యాల ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నుంచి మూడు రోజులుగా రాత్రి వేళల్లో సుమారు వెయ్యి టన్నుల ఇసుక మాయం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాక్ యార్డుల్లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకుండా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్‌ను నిలిపివేసి ఈ దందా సాగిస్తున్నారు. దీంతో 20 టన్నుల ఇసుకను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**ప్రకటనతోనే సరి**

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబుతో సహా అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటి వరకూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఉచిత ఇసుక అని చెప్పిన టన్నుకు రూ.270 వసూలు చేస్తుండగా అనధికారికంగా మూడు రెట్లు అధిక ధరలు చెల్లిస్తేనే వినియోగదారుడికి అందుతోంది. పెండ్యాల, పందలపర్రు, జీడిగుంట ఇసుక ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్ పర్యవేక్షణలో గస్తీ ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ బి.నాగరాజ్ నాయక్ తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను స్టాక్ పాయింట్ల వద్ద మంగళవారం ఆయన పరిశీలించారు.

**అధికారుల కనుసన్నల్లోనే..**

ఇసుక దోపిడీ వ్యవహారం పూర్తిగా కూటమి నాయకుల సిఫారసులతో అధికార యంత్రాంగం కనుసన్నల్లోనే జరుగుతోంది. ఉన్నతాధికారుల కదలికలతో పాటు ర్యాంపులకు ఎప్పుడొస్తారో ముందుగానే క్షేత్రస్థాయిలోని సిబ్బంది చేరవేస్తుండడంతో రాత్రి 11 గంటలకు స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను పొక్లెయిన్ల సాయంతో లారీల్లోకి ఎగుమతి చేసి రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# కటకటాల్లోకి కీచక గురువు

- బాలికలతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన
- అరెస్టు చేసిన పోలీసులు


పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న డీఈవో సలీం బాషా

**ఐ.పోలవరం:** పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు దారి తప్పాడు. తన వద్ద చదువుకుంటున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చీకురుపల్లి విద్యాసాగర్ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉండే ఏడుగురు బాలికలు ఈ పాఠశాలలో ఏడు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్నారు. వారితో విద్యాసాగర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఉపాధ్యాయుడి ప్రవర్తనను ఆ బాలికలు తమ హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. కాగా.. సాధారణ సందర్శనలో భాగంగా ఎస్సై మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీలు సోమవారం రాత్రి హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థుల బాగోగులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ అసభ్య ప్రవర్తనను బాలికలు వివరించారు. వీరి ఫిర్యాదును అధికారులు వీడియో రికార్డింగ్ చేసి మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన వెంటనే ఉపాధ్యాయుడి అరెస్టుకు ఆదేశాలిచ్చారు. దీంతో మంగళవారం విద్యాసాగర్‌ను అరెస్టు చేశారు.

**డీఈవో విచారణ**

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా మంగళవారం పాఠశాలలో విచారణ చేశారు. ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశరావుతో కలిసి విచారణ చేపట్టారు. హెచ్‌ఎం వి.సురేష్ కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే బాధిత విద్యార్థినులతో కూడా మాట్లాడారు.

**గతంలోనూ ఫిర్యాదులు**

విద్యాసాగర్‌పై గతంలోనూ ఇవే రకమైన ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు గుర్తించారు. అతడు 2021 జనవరి 15 నుంచి ఈ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం కూడా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అతడిని గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయుడు మందలించు. అలాగే 2007లో మధ్యాహ్న భోజన పథకం అమలు విషయంలో సస్పెండ్ చేశారు. 2013లో చైల్డ్ అబ్యూజ్ కేసులో అరెస్ట్ అవ్వడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ప్రస్తుతం ఐ.పోలవరం పోలీసులు అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

# యువకుడిపై పోక్సో కేసు

**పి.గన్నవరం:** ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పి.గన్నవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను మానేపల్లికి చెందిన ఎస్‌కే అజామ్ మూడేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పలుమార్లు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చివరకు పెళ్లి చేసుకోడానికి నిరాకరించాడు. దీనిపై యువకుడి తల్లిదండ్రులను బాలిక కుటుంబ సభ్యులు ప్రశ్నించగా కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు అతడి తల్లిదండ్రులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



### శలపాకలో నిందితుల ఇల్లు కూల్చివేత


గ్రామస్తులు కూల్చివేసిన నిందితుల ఇల్లు

**కాజులూరు:** శలపాకలో ఐదు రోజుల క్రితం దారుణ హత్యలకు పాల్పడిన నిందితుల ఇంటిని మంగళవారం స్థానికులు కూల్చివేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పొట్లకాయల నాగేశ్వరరావు, అతడి కుటుంబ సభ్యులు దీపావళి రాత్రి ఎదుట ఇంటిలోని బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితులైన పొట్లకాయల నాగేశ్వరారవు, పొట్లకాయల బేబీ, పొట్లకాయల సుబ్రహ్మణ్యం, పొట్లకాయల దొరబాబు, పొట్లకాయల వినోద్‌కుమార్, పొట్లకాయల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కాగా.. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ గ్రామస్తులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామం నుంచి గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌కు, అక్కడి నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించిన అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామంలోని నిందితుల ఇంటిని కూల్చివేశారు.

### మాయమాటలతో రూ.5.66 లక్షలకు టోకరా

**కొవ్వూరు:** మాయమాటలు చెప్పి రూ.5.66 లక్షలకు టోకరా వేసిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాతపట్టిసీమ గ్రామానికి చెందిన నరపురెడ్డి కనకయ్య మధురపూడి విమానాశ్రయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడికి పల్లాడి కునల్ కాశ్యప్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. క్రమంగా వీరిద్దరి మధ్య స్నేహం బలపడింది. విదేశాల్లో బంగారం చౌకగా వస్తుందని, దాన్ని తీసుకువస్తానని కాశ్యప్ నమ్మించాడు. దీని కోసం కనకయ్య దగ్గర రూ.4.80 లక్షలు తీసుకున్నాడు. అలాగే కొవ్వూరులోని బజాజ్ షోరూమ్‌లో మోటారు సైకిల్ కొనుగోలు కోసం రూ.86 వేల సెక్యూరిటీ డిపాజిట్ కట్టించాడు. అనంతరం కాశ్యప్ ఫోన్ ఎత్తడం మానేయడంతో మోసపోయినట్టు కనకయ్య గుర్తించాడు. విశాఖపట్నంలో ఉంటున్న కాశ్యప్‌ను పట్టుకుని ఎయిర్ పోర్టు పోలీసులకు అప్పగించాడు. అయితే కొవ్వూరులో బండి కొనుగోలుకు సొమ్ములు చెల్లించినందున అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరుకు ట్రాన్స్‌ఫర్ చేశారు.


### గ్యాస్ సిలిండర్ పేలి రెండు దుకాణాల దగ్ధం


కూనవరంలో కాలిపోతున్న దుకాణాలు

**ఉప్పలగుప్తం:** టిఫిన్ హోటల్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఆ దుకాణంతో పాటు సమీపంలోని టైలరింగ్ షాపు కాలిపోయింది. కూనవరంలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కూనవరం మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెనను ఆనుకుని ఒక పూరి గుడిసెలో బూసి సత్యనారాయణ టిఫిన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం సత్యనారాయణ కుమారుడు రాజేంద్ర ప్రసాద్ హోటల్‌ను తెరిచాడు. లోపల గ్యాస్ పొయ్యిని వెలిగించగానే సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. ఆ మంటలకు రాజేంద్ర ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే అంబులెన్స్‌లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. హోటల్‌తో పాటు పక్కనే కుంచే వెంకట రమణకు చెందిన టైలరింగ్ షాపు కూడా ఈ ప్రమాదంలో కాలిపోయింది. స్థానికుల సమాచారంతో అమలాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

# పట్టభద్రులూ త్వరపడండి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేటితో గడువు పూర్తి
- ఇప్పటివరకూ తూర్పు గోదావరి జిల్లాలో 33 వేల దరఖాస్తులు


ఓటు దరఖాస్తులను కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తున్న సిబ్బంది

**రాజమహేంద్రవరం రూరల్:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక త్వరలో జరగనున్న నేపథ్యంలో ఓటుహక్కు నమోదు ప్రక్రియ జరుగుతోంది. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించారు. అయితే పట్టభద్రుల ఓట్ల నమోదు మాత్రం అనుకున్నస్థాయిలో జరగడం లేదు. ఓటు నమోదుకు బుధవారంతో (ఈ నెల 6) గడువు ముగియనుంది. దీంతో పట్టభద్రులకు ఈ ఒక్కరోజే అవకాశం ఉంది. కాబట్టి చివరి రోజు దరఖాస్తులు చేసుకునే వారు ఎక్కువగా ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేవారు కచ్చితంగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ లేదా సమానమైన డిప్లమోను పూర్తి చేయాలి. 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి ఆ కోర్సు పూర్తవ్వాలి. ఫారం 18 ద్వారా ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఓటు హక్కును సిఫారసు చేస్తారు.

**గెజిటెడ్ సంతకాల తలనొప్పి**

ఓటు నమోదు దరఖాస్తుకు జత చేసే సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్ల (ప్రొవిజనల్స్)పై కచ్చితంగా గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించాల్సి ఉంది. దీంతో ఒరిజినల్స్‌తో పాటు నకళ్లు పట్టుకుని గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్లి వారి నుంచి సంతకాలు తీసుకోవడం పట్టభద్రులకు కాస్తంత ఇబ్బందికరంగా మారింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిశీలన సమయంలో రకరకాల కారణాలను అధికారులు చూపిస్తున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు విచారణ సమయంలో నివాసాలను సందర్శించి, దరఖాస్తుదారు ఉంటేనే ఆమోదిస్తామని చెబుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని కొందరు ఆవేదన చెందుతున్నారు. కాగా.. httpr://coeandhra.nic.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**గడువు పెంచాలి**



ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేదు. దీంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. బుధవారంతో గడువు ముగుస్తుందని ప్రభుత్వం తెలిపింది. అయితే దరఖాస్తుకు గడువును ఇంకా పెంచాలి. అలాగే ప్రొవిజనల్స్‌పై గెజిటెడ్ అధికారి సంతకాలు ఉండాలనే నిబంధనతో పట్టభద్రులు ఇబ్బంది పడుతున్నారు.

– పడాల రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి, ధవళేశ్వరం

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎన్నికల నగారా

- అమల్లోకి ఎన్నికల కోడ్
- జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,893 మంది ఉపాధ్యాయులు

**ఎన్నికల షెడ్యూల్**

| | |
|---|---|
| నోటిఫికేషన్ జారీ | 11-11- 2024 |
| నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ | 18-11-2024 |
| నామినేషన్ల పరిశీలన | 19-11-2024 |
| అభ్యర్థుల ఉపసంహరణ | 21-11-2024 |
| పోలింగ్ | 05-12-2024 |
| ఓట్ల లెక్కింపు | 09-12-2024 |
| ఎన్నికల కోడ్ ముగింపు | 12-12-2024 |

**సాక్షి, రాజమహేంద్రవరం:** తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్‌తో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి ఈ వివరాలను వెల్లడించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం నుంచి కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. 18 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేశామని, సుమారు 2,893 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, ఆర్డీఓ టి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.